


## సినిమా విశ్వం లాంటిది

‘సవాళ్లతో కూడుకున్న పాత్రలు అరుదుగా దొరుకుతుంటాయి. నటుడి ఆకలి తీరేది అలాంటి పాత్రలు పోషించినప్పుడే’ అన్నారు బిగ్‌బీ అమితాబ్. పుట్టినరోజు సందర్భంగా అభిమానులు, శ్రేయోభిలాషులు, బంధువులు బిగ్‌బీకి శుభాకాంక్షలు తెలిపిన విషయం తెలిసిందే. వీరిలో ‘కల్కి’ చిత్ర యూనిట్ కూడా ఉన్నారు. అమితాబ్ పుట్టినరోజును పురస్కరించుకుని ‘కల్కి’లో ఆయన లుక్‌ని విడుదల చేశారు మేకర్స్. ఆ లుక్ దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఈ పోస్టర్‌ని తన వ్యక్తిగత సోషల్‌మీడియాలో పొందుపరిచి, ఓ కామెంట్ కూడా షేర్ చేశారు బిగ్‌బీ ‘సినిమా రంగం విశ్వం లాంటిది. అడుగడుగునా ఒడిదొడుకులే, ఎత్తుపల్లాలే. వాటన్నింటినీ సమర్థవంతంగా దాటి వెళ్లాలి. ఇక్కడ విజయం సమిష్టికృషి వల్లే సాధ్యం. ఎన్నో రకాల ఊహలకు, ఆలోచనలకూ రూపమే సినిమా’ అని పోస్ట్ చేశారు బిగ్‌బీ అమితాబ్.



రాకేశ్, మంత్రి మల్లారెడ్డి, అంజి, రాఘవ, వంశీ

## గిరిజన తండా నేపథ్యంలో ‘కేసీఆర్’

‘జబర్దస్త్’షో ద్వారా గుర్తింపును సంపాదించుకున్న రాకింగ్ రాకేష్ హీరోగా నటిస్తున్న చిత్రం ‘కేసీఆర్’ (కేశవ్ చంద్ర రమావత్). గరుడవేగ అంజి దర్శకత్వం వహిస్తున్నారు. విభూది క్రియేషన్స్ సంస్థ నిర్మిస్తున్నది. శుక్రవారం ఈ సినిమా టైటిల్‌తో పాటు 50 అడుగుల భారీ కటౌట్‌ను మల్లారెడ్డి యూనివర్సిటీలో మంత్రి మల్లా రెడ్డి ఆవిష్కరించారు. ఈ వేడుకలో పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు. తెలంగాణలోని గిరిజన తండా నేపథ్యంలో జరిగే కథ ఇదని చిత్ర బృందం పేర్కొంది. అనన్య, తనికెళ్ల భరణి, కృష్ణభగవాన్, ధన్‌రాజ్, తాగుబోతు రమేష్, రచ్చ రవి, జోర్దార్ సుజాత తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: చరణ్ అర్జున్, సాహిత్యం: కాసర్ల శ్యామ్, గోరటి వెంకన్న, చరణ్ అర్జున్, ఆర్ట్: బత్తుల మహేష్, రచన: నవీన్ కోలా, రాకింగ్ రాకేశ్, నిర్మాణం: గ్రీన్ టీ ప్రొడక్షన్స్, సినిమాటోగ్రఫీ, దర్శకత్వం: గరుడవేగ అంజి.



## రేచీకటితో బాధపడుతున్న మృణాల్ ఠాకూర్?

కథానాయిక మృణాల్‌ఠాకూర్ రేచీకటితో బాధపడుతున్నదట. ఆ విషయాన్ని దాచేసి, వరుడిని వెతికేపనిలో ఉన్నారంట ఆమె కుటుంబసభ్యులు. ఏంటీ.. ఇదంతా నిజమే అనుకుంటున్నారా? విషయం ఏంటంటే, ఆమె బాలీవుడ్‌లో ‘ఆంఖ్ మిచోలీ’ అనే సినిమా చేస్తున్నది. అందులో మృణాల్‌కి రేచీకటి. ఆ విషయాన్ని దాచి వరుడుకోసం వెతుకుతుంటారు కుటుంబసభ్యులు. ఈ విషయాన్ని ఓ ఇంటర్వ్యూలో బయటపెట్టింది మృణాల్. ఈ తరహా పాత్ర చేయడం ఇదే ప్రథమమని, నటిగా తనకిది ఛాలెంజ్ అని మృణాల్ అన్నది. సినిమాల్లో సరే, నిజంగా మీ పెళ్లెప్పుడు? అనడిగితే. ‘నా కుటుంబం నుంచి ఒత్తిడి ఎక్కువగానే ఉంది. కాకపోతే నన్ను భరించేవాడు అసలు ఉన్నాడా అనేది నా డౌట్’ అంటూ నవ్వేసింది మృణాల్.



## సినిమాటిక్ అడ్వెంచర్

చిరంజీవి అంటే మాస్.. మాస్ అంటే చిరంజీవి. ఇందులో రెండోమాట లేదు. చిరంజీవి సినిమా అంటే అభిమానులకు విందుభోజనమే. ‘వాల్తేరు వీరయ్య’తో రెండువందల కోట్ల క్లబ్‌లో చేరి నేటికీ తన ఇమేజ్ ఇసుమంతకూడా తగ్గలేదని నిరూపించారు చిరంజీవి. త్వరలో ‘బింబిసార’ఫేం వశిష్ఠ దర్శకత్వంలో ఓ చిత్రం చేయనున్నారాయన. సోషియో ఫాంటసీ కథాంశంతో ఈ చిత్రం తెరకెక్కనున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం ఈ సినిమా ప్రీప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. ఇదిలావుంటే ఇటీవల ఓ కార్యక్రమంలో చిరంజీవి మాట్లాడుతూ ‘నా సినిమా అంటే డాన్సులు, ఫైట్లు, ఎలివేషన్లూ, మసాలా ఐటమ్స్ కామన్. నా నుంచి జనం ఆశించింది నేను ఇవ్వాలి. నేను కూడా ఎలాంటి శారీరకశ్రమ లేకుండా అలా నడుచుకుంటూ కష్టంలేని కేరక్టర్లు చేసి, వాళ్లిచ్చే డబ్బుల్ని జేబులో వేసుకొని వెళ్లిపోవచ్చు. కానీ అలా చేయటానికి నా మనసొప్పుకోదు. అభిమానుల కోసం పడే కష్టంలోనే ఆనందం ఉంటుంది నాకు’ అన్నారు చిరంజీవి. ఆ మాటల్ని తూచా తప్పకుండా పాటిస్తూ.. వయసును కూడా లెక్కచేయకుండా నేటికీ డ్యాన్సులతో, ఫైట్లతో అభిమానుల్ని అలరిస్తున్నారు చిరంజీవి. త్వరలో ఆయన వశిష్ట దర్శకత్వంలో చేయబోతున్న సినిమా కూడా ‘జగదేకవీరుడు అతిలోకసుందరి’ని మరిపించేలా ఉంటుందని తెలుస్తున్నది. సోషియో ఫాంటసీ విషయంలో తప్ప ఎక్కడ కూడా ‘జగదేకవీరుడు-అతిలోకసుందరి’కీ తమ కథకూ పోలిక ఉండదని మేకర్స్ చెబుతున్నారు. ఇంకా ఈ సినిమా గురించి దర్శకుడు వశిష్ఠ మాట్లాడుతూ ‘త్వరలోనే అందర్నీ సినిమాటిక్ అడ్వెంచర్‌లోకి తీసుకెళ్లనున్నాం. రెడీగా ఉండండి’ అన్నారు. అనుష్క, మృణాల్‌ఠాకూర్ కథానాయికలుగా నటించే అవకాశం ఉన్నట్టు తెలుస్తున్నది.



‘టైగర్ నాగేశ్వరరావు’ చిత్రంలో రేణూ దేశాయ్

## యువతకు స్ఫూర్తినిస్తుంది

**‘టైగర్ నాగేశ్వరరావు’ చిత్రంలో సామాజిక సంస్కర్త, సంఘ సేవకురాలు హేమలత లవణం పాత్రను పోషిస్తున్నది నటి రేణూ దేశాయ్. రవితేజ కథానాయకుడిగా వంశీ దర్శకత్వంలో అభిషేక్ అగర్వాల్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 20న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా శుక్రవారం రేణూ దేశాయ్ పాత్రికేయులతో ముచ్చటించింది. ఆ విశేషాలు..**

హేమలత లవణం గొప్ప సామాజిక సేవకురాలు. ఆ రోజుల్లోనే చంబల్, బుందేల్‌ఖండ్ వంటి బందిపోటు ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి సంస్కరణలు చేపట్టారు. అంటరానితనం, జోగినీ వ్యవస్థపై పోరాటం చేశారు. అలాంటి గొప్ప మహిళ పాత్రను పోషించడం నా పూర్వజన్మసుకృతంగా భావిస్తున్నా. నేటితరంలో స్ఫూర్తినింపే పాత్ర ఆమెది. ఈ పాత్ర కోసం హేమలత లవణం మేనకోడలిని కలుసుకొని చాలా సమాచారాన్ని సేకరించాను. ఆమె బాడీలాంగ్వేజ్ గురించి తెలుసుకొని అదే విధంగా తెరపై కనిపించే ప్రయత్నం చేశా. అలాగే తెలుగులో కూడా స్పష్టంగా మాట్లాడేలా శిక్షణ తీసుకున్నా.

**అదే బిగ్గెస్ట్ కాంప్లిమెంట్**

ఈ పాత్ర నా వ్యక్తిగత జీవితంలో చాలా మార్పులను తీసుకొచ్చింది. సామాజికంగా మరిన్ని కార్యక్రమాలు చేయాలనే స్ఫూర్తినిచ్చింది. చిన్నపిల్లలు ఎవరూ ఆకలితో ఉండకూడదన్నది నా లక్ష్యం. నా దిశగా మరిన్ని ప్రయత్నాలు చేయాలనుకుంటున్నా. ఈ సినిమా ట్రైలర్ చూసిన నా కూతురు ‘వయసుకు తగిన పాత్ర పోషించినందుకు చాలా గర్వంగా ఉందమ్మా’ అని చెప్పింది. అదే నాకు బిగ్గెస్ట్ కాంప్లిమెంట్ అనుకుంటున్నా.

**నటనను కొనసాగిస్తా**

కొడుకుని బిగ్ స్క్రీన్‌పై చూడాలని ప్రతీ తల్లి కోరుకుంటుంది. అయితే నా కుమారుడు అకీరాను హీరోగా పరిచయం చేయాలనే ఆలోచన ఇప్పటివరకూ రాలేదు. అకీరాది చాలా భిన్నమైన వ్యక్తిత్వం. అతను పియానో నేర్చుకున్నాడు. యోగా, మార్షల్ ఆర్ట్స్, కిక్ బాక్సింగ్‌పై మంచి పట్టుంది. తను హీరో అవ్వాలని నిర్ణయించుకుంటే ఆ విషయాన్ని ముందుగా నేనే ప్రకటిస్తా. నటన పట్ల నాకు ఎప్పుడూ పాషన్ ఉంటుంది. నా వయసుకు తగిన పాత్రలు దొరికితే తప్పకుండా నటిస్తా.



## మిలాన్‌లో గోపీచంద్ చిత్రం


గోపీచంద్ కథానాయకుడిగా శ్రీను వైట్ల దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. చిత్రాలయం పతాకంపై వేణూ దోనేపూడి నిర్మిస్తున్నారు. ఇటలీలోని మిలాన్‌లో ఈ సినిమా తాలూకు కీలక షెడ్యూల్ పూర్తయింది. ఇందులో చిత్ర ప్రధాన తారాగణం మొత్తం పాల్గొన్నారు. ‘మాస్, ఫ్యామిలీ అంశాలు కలబోసి తనదైన శైలిలో దర్శకుడు శ్రీను వైట్ల ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ‘ఇటలీలోని మిలాన్‌లోని సుందరమైన లొకేషన్స్‌లో ఓ పాటతో పాటు కీలకమైన టాకీ పార్ట్ చిత్రీకరించాం. ఈ సినిమాలో చాలా భాగం విదేశాల్లో షూటింగ్ జరుపుకుంటుంది. గోపీచంద్ కెరీర్‌లోనే వైవిధ్యమైన చిత్రంగా నిలిచిపోతుంది’ అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: కెవీ గుహన్, సంగీతం: చైతన్ భరద్వాజ్, రచన-దర్శకత్వం: శ్రీను వైట్ల.



సితార

## సినిమా నా డీఎన్‌ఏలోనే ఉంది

పువ్వు పుట్టగానే పరిమళిస్తుందంటారు. అందుకు నిదర్శనమే మహేశ్‌బాబు కుమార్తె సితార. పెరిగిన సోషల్ మీడియా పుణ్యమా అని కొన్నాళ్లక్రితం పసిపాపగా చూశాం. ఇప్పుడు టీనేజర్‌గా చూస్తున్నాం. ఓ విధంగా మన కళ్లముందే ఎదుగుతూవుంది సితార. అలాగే హీరోయిన్ కావడానికి తర్ఫీదు తీసుకుంటూ, డ్యాన్సుల్లో మెళకువలు నేర్చుకుంటూ సూపర్‌స్టార్ కృష్ణ లెగసీని ముందుకు తీసుకెళ్లేపనిలో ఉంది ఈ బంగారుబొమ్మ. ఈ మధ్య ఓ వ్యాపారసంస్థకు సంబంధించిన ప్రకటనలో కూడా తళుక్కున మెరిసి మహేశ్ కూతురా మజాకా అనిపించింది. హీరోయిన్ అవ్వడం తన డ్రీమ్ అని మీడియా ముఖంగా ఇప్పటికే చెప్పేసిన సితార, సినిమా రంగంపై అపారమైన ప్రేమను పెంచేసుకుంది. ఈ రోజు ప్రపంచ సినిమా దినోత్సవం సందర్భంగా వ్యక్తిగత సాంఘిక మాధ్యమంలో సితార పెట్టిన పోస్ట్ ప్రస్తుతం ఫిలింవర్గాల్లో చర్చనీయాంశమైంది. ‘సినిమా అనేది ఓ ఇండస్ట్రీ మాత్రమే కాదు. అది నా డీఎన్‌ఏ. మా తాత సూపర్ స్టార్ కృష్ణ సినిమానే శ్వాసగా బతికారు . ఆయనే నాకు ఆదర్శం. ఆయన వారసురాలిని అయినందుకు గర్విస్తూ, తాతయ్య లెగసీని ముందుకు తీసుకెళ్లాలనుంది. మా నాన్న ఎలాగైతే వాళ్లనాన్న నుంచి స్ఫూర్తి పొందారో, నేనూ ఆలాగే మా నాన్న నుంచి స్ఫూర్తి పొందా’ అంటూ పోస్ట్ చేసింది సితార.



అక్షయ్ కుమార్

## అది డాక్యుమెంట్ కాదు.. నా ఆత్మ!


‘నేను భారతీయుడ్ని. ఈ మట్టిలోనే పుట్టాను. ఈ మట్టిలోనే కలిసిపోవాలనేది నా కోరిక. ఏ దేశంలో ఉన్నా నా సంప్రదాయాలను వదులుకోలేదు. ఓ చిన్న తప్పు నన్ను భారతీయ పౌరసత్వానికి దూరం చేసింది. ఇప్పుడు మళ్లీ పొందగలిగాను. చెప్పలేని సంతోషంగా ఉంది’ అన్నారు బాలీవుడ్ సూపర్ స్టార్ అక్షయ్‌కుమార్. ఆయన ఇటీవలే భారత పౌరసత్వాన్ని పొందారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ‘ఒకానొక దశలో నేను చేసిన ఎనిమిది సినిమాలు వరుసగా ఫ్లాపులయ్యాయి. నిర్మాతలకు తీవ్ర నష్టాలు తెచ్చిపెట్టాయి. దాంతో మిగిలిన రెండు సినిమాలనూ పూర్తి చేసి, దేశం వదిలి కెనడా వెళ్లిపోయాను. అక్కడ రెండేళ్లుండగానే నాకు కెనడా పౌరసత్వం లభించింది. యాదృచ్ఛికంగా ఇక్కడ చివరిగా నేను చేసిన రెండు సినిమాలు భారీ విజయాలను అందుకున్నాయి. మళ్లీ అవకాశాలు మొదలయ్యాయి. దాంతో కెనడా వదిలి మళ్లీ మన దేశం వచ్చేశాను. కానీ కెనడా పౌరసత్వం తీసుకున్న కారణంగా భారతీయ పౌరసత్వానికి దూరమయ్యాను. అది కొన్నేళ్లుగా నన్ను బాధిస్తూనే వుంది. చివరకు కెనడా సభ్యత్వం వదులుకున్నాను కూడా. రీసెంట్‌గా కొన్ని నెలల ముందు మళ్లీ నన్ను భారతీయుడిగా గుర్తించి పౌరసత్వం అందించారు. అలాగే భారత్ పాస్‌పోర్ట్ కూడా నాకు వచ్చింది. దీన్ని కేవలం ట్రావెలింగ్ డాక్యుమెంట్ మాత్రమేనని నేను అనుకోవడంలేదు. ఇది నాకు ఆత్మ. వీటిని చూసినప్పుడు భారతీయుడిగా నా హృదయం ఉప్పొంగుతుంది’ అన్నారు అక్షయ్ కుమార్.



శ్రీలీల

## ఇదే సరైన సమయం

డాక్టర్ కాబోయి యాక్టర్ అయ్యానని చెబుతుంటారు. కానీ అచ్చ తెలుగందం శ్రీలీల మాత్రం యాక్టర్‌గా రాణిస్తూనే మరోవైపు మెడిసిన్ పూర్తి చేసే పనిలో ఉంది. ఈ భామ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం ‘భగవంత్ కేసరి’. బాలకృష్ణ కథానాయకుడిగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం ఈ నెల 19న విడుదలకానుంది. ఈ సందర్భంగా శ్రీలీల పాత్రికేయులతో ముచ్చటిస్తూ ‘ఈ కథ నాకు ఎంతగానో నచ్చింది. గ్లామర్ రోల్స్ చేయడానికి చాలా సినిమాలుంటాయి. కానీ ఇలాంటి భావోద్వేగభరితమైన, అభినయ ప్రధానమైన పాత్రలు చాలా అరుదుగా లభిస్తుంటాయి. నటిగా నన్ను నేను నిరూపించుకోవడానికి ఇదే సరైన సమయం అనిపించింది. ఈ సినిమాలో విజ్జి పాపగా నా పాత్ర ఎమోషనల్‌గా సాగుతుంది. ‘ఆడపిల్ల లేడీ పిల్లలా కాదు..పులి పిల్లలా ఉండాలి’ అని ఓ డైలాగ్ ఉంది. నా పాత్ర కూడా అదే రీతిలో ఉంటుంది. తండ్రీకూతుళ్ల బంధాన్ని సినిమాలో అందంగా ప్రజెంట్ చేశారు’ అని చెప్పింది.



## ఆయుధం లేకుండానే శత్రుసంహారం

సల్మాన్‌ఖాన్, కత్రినాకైఫ్ జంటగా నటిస్తున్న చిత్రం ‘టైగర్-3’. సక్సెస్‌ఫుల్ ఫ్రాంఛైజీ టైగర్, టైగర్ జిందాహై సిరీస్‌లో మూడో సినిమాగా ‘టైగర్-3’ని తెరకెక్కించారు. ఈ చిత్రాన్ని దీపావళి పర్వదినం రోజున ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నారు. ఈ చిత్ర ట్రైలర్‌ను ఈ నెల 16న విడుదల చేయబోతున్నారు. ఈ సందర్భంగా కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. సల్మాన్ ఖాన్ మాట్లాడుతూ ‘ఈ సినిమా రా అండ్ రియలిస్టిక్‌గా ఉంటుంది. టైగర్ ఫ్రాంఛైజీలో హీరోలను లార్జర్ దేన్ లైఫ్‌లో చూపిస్తారు. కానీ ఇందులో రియల్ హీరోయిజం ఉంటుంది. ఆయుధం లేకుండానే శత్రువుల అంతం చూసే కథానాయకుడు కనిపిస్తాడు. స్వతహాగా టైగర్ తన వేటను పూర్తి చేసే వరకు నిష్క్రమించదు. ఈ సినిమాలో కూడా నా పాత్ర అదే విధంగా ఉంటుంది’ అన్నారు. యష్ రాజ్ ఫిల్మ్స్ స్పై యూనివర్స్‌లో భాగంగా ‘టైగర్-3’ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. మనీష్ శర్మ దర్శకత్వం వహిస్తున్నారు.

## తెర వెనక వ్యూహాలను చూపించాం



కిరణ్‌కుమార్, రామ్‌గోపాల్ వర్మ

ఏపీ ముఖ్యమంత్రి వై.యస్.జగన్మోహన్ రెడ్డి రాజకీయ జీవితంలోని సంఘటనల ఆధారంగా ప్రముఖ దర్శకుడు రామ్‌గోపాల్‌వర్మ తెరకెక్కించిన చిత్రం ‘వ్యూహం’. రామదూత క్రియేషన్స్ పతాకంపై దాసరి కిరణ్ కుమార్ నిర్మించారు. వై.యస్.జగన్ పాత్రలో అజ్మల్ నటించారు. నవంబర్ 10న ఈ చిత్రం విడుదలకానుంది. శుక్రవారం ట్రైలర్‌ను ఆవిష్కరించారు. రామ్‌గోపాల్‌వర్మ మాట్లాడుతూ ‘ఒక పెద్ద సంఘటన జరిగినప్పుడు దాని వెనక ఎన్నో పరిణామాలు చోటుచేసుకుంటాయి. అవన్నీ బయటి ప్రపంచానికి తెలియవు. అలాంటి విషయాలను ఈ సినిమాలో చూపించాను. నేను సేకరించిన సమాచారాన్ని ప్రేక్షకులకు నచ్చే సినిమాటిక్ ఫార్మాట్‌లో తెరకెక్కించాను’ అని చెప్పారు. జగన్ రాజకీయ జీవితంలోని ఆసక్తికరమైన సంఘటనలను తీసుకొని ఈ సినిమా చేశామని నిర్మాత పేర్కొన్నారు. ఈ సినిమాతో పాటు తాను ‘శపథం’ అనే మరో చిత్రాన్ని తెరకెక్కించానని, జనవరి 25న విడుదలవుతుందని రామ్‌గోపాల్‌వర్మ తెలిపారు.